మేనేజర్ అతనిని చూచి చిరునవ్వు నవ్వాడు “కూర్చోండి, నరసింహం గారూ! ఎనీ ప్రాబ్లమ్?”

“అవునండీ! ఒకడికి పదివేల మొత్తం చొప్పున 50 బేరర్ చెక్కులిచ్చాను. మీరు వాటి పేమెంట్ ఆపాలి!”

“అలాగా - ఎందుకు పేమెంట్ ఆపటం?”

“వాడు ఒక దొంగ అని తెలిసిందిప్పుడే-”

“సరే-” అంటూ బెల్ నొక్కాడతను.

ఫ్యూన్ పరుగుతో వచ్చాడు.

“ఎంకౌటెంట్‌ని పిలు-” చెప్పాడు మేనేజర్.

మరుక్షణంలో ఎకౌంటెంట్ వచ్చాడు లోపలకు “యస్సార్-”

“నరసింహం గారిచ్చిన బేరర్ చెక్కులు యాక్సెప్ట్ చేయకండి. ఆ చెక్కులు ఎవరైనా ప్రెజెంట్ చేస్తే తెచ్చినతనిని నమ్మకంగా కూర్చోబెట్టి నాకు చెప్పండి-”

“ఆ చెక్కులు ఇంతకు ముందే కాష్ అయాయండీ-”

నరసింహం మొఖం మాడిపోయింది.

కాషియర్ అన్నాడు - “ఒకేసారి అన్ని చెక్కులు వచ్చాయి కాబట్టి నాకు అనుమానం వేసింది సార్! కాని తెచ్చింది నరసింహం గారి కూతురే కాబట్టి, నేను పెద్దగా పట్టించుకోలేదు...”

నరసింహం  అదిరిపడ్డాడు.

రాధ.....రా.......ధ........

20

“హల్లో!”

“హల్లో!”

“రాధా - నేనే... డబ్బు డ్రా చేశావా?”

“చేశానండీ.”

“ఏమీ గొడవ జరగలేదుగా!”

“లేదండీ. డబ్బు ఎక్కడికి తీసుకురాను?”

“హోటల్ ఓబరాయ్! రూమ్ నెంబరు1114”

“మీరు అక్కడెందుకున్నారు-”

“చెప్తాగా రా!”

రాధ బయల్దేరింది. ఆమె వెళ్ళిన రెండు నిమిషాలకి నరసింహం కారు స్పీడ్‌గా వచ్చి గేటు ముందు ఆగింది.

కారులోంచి దిగకుండానే నరసింహం ఘూర్ఖాని కంగారుగా అడిగాడు “అమ్మాయి దారున్నాదా?”

"ఇప్పుడే......ఇప్పుడే వెళ్ళారు సార్!"

నరసింహం కృంగిపోయాడు. క్షణాల్లో పరిస్థితి చేజారిపోయింది.

రాధ ఎటు వెళ్ళి వుంటుంది? అయినా అంత డబ్బు డ్రా చెయ్యమని ఇస్తే - వెంటనే తనకి అనుమానం రావాలి కదా, ఎందుకు రాలేదు? మరీ అంత చిన్న పిల్లలా ఎందుకు ప్రవర్తించింది?

అతడు ఆలోచనల్లో వుండగానే మురళి ప్రవేశించాడు.

"రాధేది మావయ్యా!"

"షాపింగ్‌కి వెళ్ళింది-" అబద్ధమాడాడు నరసింహం. అతడి మనసు ఎందుకో కీడును శంకించసాగింది. మురళి అతడి ఫీలింగ్స్ గమనించటంలేదు. మురళి ఎగ్జైటింగ్‌గా వున్నాడు.

"మా అమ్మని కలుసుకున్నాను మావయ్యా! మొత్తం దీని వెనుక వున్నది ఎవరో తెలిసిపోయింది" అన్నాడు.

నరసింహం మొహంలోకి రక్తం చివ్వున చిమ్మింది.

"మీ అమ్మని కలుసుకున్నావా?"

"అవును. యాధృచ్ఛికంగా కనబడింది. నన్ను చూసి హరికృష్ణ అనుకుంది. రెండు నిమిషాలు మాట్లాడాను. 'ఇంక ఎంతకాలం నేనిలా నాటకం ఆడాలి ఇన్‌స్పెక్టర్!' అంది. దీని వెనుక వున్నది ఎవరో తెలిసిందా మావయ్యా?"

"ఎవర్రా? ఎవర్రా?"

"సి.బి.ఐ."

నరసింహం చేతులు వణకసాగాయి "సి........సి.....సి.బి.ఐ యా?" అన్నాడు కంపిస్తున్న కంఠంతో.

"అవును మావయ్యా! నాలాంటి ఎత్తు పొడవూ వున్న ఒక ఆఫీసర్‌కి ప్లాస్టిక్ సర్జరీ చేసి అద్భుతంగా నాటకం ఆడారు. నాకు అసలు విషయం కూడా తెలిసిపోయింది. నువ్వు నా అన్ననీ - తండ్రినీ చంపిన విషయం కూడా-"

నరసింహం స్థబ్ధుడై చూశాడు.

మురళి పచార్లు చేస్తున్నాడు. దీర్ఘంగా ఆలోచిస్తున్నట్టు అతడి నడకే చెపుతోంది.

"ఇదంతా ఒక ప్లాన్ ప్రకారం జరిగింది. నేను హాస్టల్‌లో వుండే రోజుల్లోనే ఈ ఆఫీసర్ నన్ను ఆ వేషంలో ఇబ్బంది పెట్టాడు. కానీ అప్పుడు నేను అంతగా దీన్ని పట్టించుకోలేదు. ఆ రోజుల్లోనే నేను నీ కూతుర్ని ప్రేమించాను. నిన్ను అటాక్ చెయ్యటానికి నన్ను ఆయుధంగా వాడుకోదల్చుకున్నారు వాళ్ళు. హరికృష్ణ పేరు మీద రంగంలోకి ప్రవేశించాడు అతడు. నేను నీ కూతురిని ఎలాగైనా పెళ్ళి చేసుకుంటాననీ, నా రూపంలో నిన్ను ఇబ్బంది పెట్టవచ్చుననీ అనుకున్నారు. వాళ్ళు అనుకున్నట్టే జరిగింది. నాకూ రాధకీ వివాహం జరిగింది. అప్పటి నుంచీ మన కష్టాలు ప్రారంభమయ్యాయి. అయితే ఇక్కడ అసలు విషయం

చెప్పేయాలి. నేను శారద కొడుకుని కాదు."

నరసింహం అదిరిపడి - "మరి" అన్నాడు.

"నా పేరు మురళీకృష్ణ. అంతవరకే......నా తల్లి శారదమ్మ కాదు. నేనొక అనాధని. ఒకరోజు జైలునుంచి నాకో ఉత్తరం వచ్చింది. నేను తన కొడుకుని అని భ్రమపడుతూ ఒక ఆవిడ ఉత్తరం వ్రాసింది. నేను దాన్ని అంతగా పట్టించుకోలేదు. ఈ లోపులో రామలింగం - రాధ చిన్నప్పటి పెళ్ళి విషయం చెప్పాడు. తన ఒకప్పటి భర్త అని తెలిస్తేగానీ రాధ మనస్ఫూర్తిగా ప్రేమించేలా కనబడలేదు. అందుకే ఆ మురళీకృష్ణని నేనే అని అబద్ధమాడాను. రాధతో వివాహం జరిగిపోయింది. రాధ అంటే నాకు ప్రాణం. డబ్బు అంటే నాకు చాలా ఇష్టం. చిన్న అబద్ధం వల్ల ఈ రెండూ నాకు దొరికాయనుకున్నాను..... కానీ కష్టాలు ఇలా వెంటాడతాయనుకోలేదు. దీనికంతటికీ కారణం శారదమ్మే! నేనే హరికృష్ణలా నాటకం ఆడుతున్న సి.బి.ఐ ఆఫీసర్ని అనుకుని ఆమె అరగంట క్రితం వివరాలన్నీ చెప్పకపోయివుంటే, ఈ రహస్యం ఎప్పటికి బయటపడేది కాదు. ఇప్పుడు ఇక అసలు విషయం తెలిసిపోయింది కాబట్టి మనం ఆ హరికృష్ణగాడికి భయపడే అవసరం లేదు. చేయవలసిందల్లా - ఆ హరికృష్ణగాడు రాధని ముందు ముందు మోసం చెయ్యకుండా వుండటం -"

నరసింహం దిగ్భ్రాంతుడై చూశాడు. తనే అనుకుంటే తనకన్నా దారుణమైన వాళ్ళున్నారన్నమాట ఈ ప్రపంచంలో!

"శారదమ్మ పెద్దకొడుకు హరికృష్ణ మన రంగా చిన్నప్పుడే చంపేశాడు. మరి మురళీకృష్ణ ఏమయ్యాడు?"

"తెలీదు. అసలు ఆ కుటుంబ వివరాలు ఏవీ నాకు తెలీదు మావయ్యా! చెప్పాగా ఎవరో శారదమ్మ నాకు - కేవలం పేరు చూసి భ్రమించి, నేను కూడా అనాధనని తెలిసి ఉత్తరం వ్రాసింది. నాకా - నా వాళ్ళంటూ ఎవరూ లేరు. ఎప్పుడో చిన్నప్పటి కొడుకుని నేనే అంటే ఏదైనా ఆస్తి కలిసిస్తుందేమో అని అలా చెప్పాను. ఆవిడ నాకన్నా దరిద్రురాలని తెలిసింది మళ్ళీ జైలుకి వెళ్ళటం మానేశాను. ఈలోపులో రామలింగం బాబాయ్ శారదమ్మే రాధ అత్తని చెప్పేసరికి - ఇంత ప్లాను వేశాను. కానీ ఒకటి మాత్రం నిజం - నాకు డబ్బంటే చాలా ఇష్టం. కానీ దానికన్నా రాధ అంటే మరీ ఇష్టం. ఈ రెంటి కోసం ఏమైనా చేస్తాను."

ఫోన్ మ్రోగింది నరసింహం ఎత్తాడు.

"నాన్నా......నేనే రాధని........ఓబెరాయ్ హోటల్నుంచి మాట్లాడుతున్నాను. ఆయన ఇప్పుడే వస్తానని చెప్పి వెళ్ళారు. అరగంట అయినా రాలేదు. భయంగా ఉంది."

"అమ్మా - డబ్బేమయింది"

"ఆయన తీసుకెళ్లారు-"

నరసింహం మురళీవైపు తిరిగి కంగారుగా "అల్లుడూ, కొంప మునిగింది. మన రాధని హోటల్లోకి పిలిపించి డబ్బు......" అంటూ అంతా వివరంగా చెప్పాడు.

మురళీ నవ్వాడు. మొట్టమొదటిసారి అతడు కంగారుపడటం లేదు "ఆ సి.బి.ఐ ఆఫీసరు సరిగ్గా మన ట్రాప్‌లో ఇరుక్కున్నాడు మావయ్యా!" అన్నాడు లేస్తూ.

నరసింహం అయోమయంగా చూశాడు.

"విధి నిర్వహణలోనే చేశాడో - లేక తన స్వంత స్వార్థంతో - కలిసొస్తుంది కదా అని ఈ అయిదు లక్షలూ లాగేశాడో మనకి తెలీదు, దీన్నే మనం మనకి లాభకరంగా వుపయోగించుకుంటాం"

"ఎలా?"

"ఆ శారదమ్మ ఎక్కడ ఉంటుందో తెలుసు నాకు. మాటల్లో పెట్టి కనుక్కున్నాను. అక్కడ కాపు వేస్తాం నేనూ - రంగా! వాడు రాగానే ఇద్దర్నీ చంపేస్తాం అనుకో. శారదమ్మ శవాన్ని అక్కడే వదిలేసి, కేవలం వాడి శవాన్ని మాత్రమే మూడో కంటికి తెలియకుండా మాయం చేస్తాం. సరిగ్గా ఇదే సమయానికి నువ్వు పోలీస్ స్టేషన్‌లో - నీ కూతుర్ని కిడ్‌నాప్ చేసి అయిదు లక్షలు ఎవరో కొట్టేశారని రిపోర్టుఇస్తావు. ఇంకో రకంగా చెప్పాలంటే - సరిగ్గా అక్కడ మేము హత్య చేసే సమయానికి నువ్వు ఇక్కడ పోలీస్ స్టేషన్‌లో వుంటావు. నీకు మంచి ఎలిబీ వుంటుంది. ఇంకెవరికీ శారదమ్మని హత్య చేసే అవసరం లేదు. సి.బి.ఐ ఆఫీసరే ఆవిడని హత్యచేసి అయిదు లక్షల్తో పారిపోయాడని ప్రభుత్వం అనుకుంటుంది. ఒకవేళ అలా అనుకోపోయినా మనకి ఫర్వాలేదు. ఎందుకంటే రేపు కోర్టులో ఏమీ నిరూపించలేరు కనుక......నీకు మంచి ఎలిబీ వుంది కనుక....."

నరసింహం దాదాపు మతిపోయినవాడిలా చూశాడు. ఈ మాస్టర్ ప్లాన్‌కి తల తిరిగిపోయింది.

"కానీ ఆ హరికృష్ణ గాడూ, శారదమ్మ అంత సులభంగా దొరుకుతారా?"

"ఆ విషయం నాకూ - రంగాకి వదిలిపెట్టు. నువ్వు రాధకి ఫోన్ చేసి, తనని అట్నుంచి అటే పోలీస్ స్టేషన్‌కి వచ్చేయమను. మీరు చేయవలసిందల్లా, మా నుంచి పోలీస్ స్టేషన్‌కి ఫోన్ వచ్చేవరకూ అక్కడ వుండటమే! 'ఏమైంది మావయ్యా! బ్లాక్ మెయిలర్ దొరికాడా' అని అడుగుతాను. మిగతా విషయాలు రంగా చెపుతాడు. అదే గుర్తు- హత్య జరిగిపోయినట్లు......పోతే - చుట్టుపక్కలవాళ్ళకి హరికృష్ణే శారదమ్మ ఇంట్లో ప్రవేశిస్తున్నట్టు తెలిసేలా నేను బాహాటంగానే లోపలికి వెళతాను. రంగా ఇంటి వెనుకవైపు కారు పెడతాడు. హరికృష్ణ శవాన్ని అట్నుంచి మాయం చేస్తాడు. చూసిన వాళ్ళందరికీ అతడే ఆమెని చంపి పారిపోయాడన్న నమ్మకం కలుగుతుంది. ఆ తరువాత అతడు మరిక కనపడడు కాబట్టి ప్రభుత్వమూ అతడినే అనుమానిస్తుంది. ఒకవేళ మనని అనుమానించిన ఏమీ చేయలేక వూరుకోక తప్పదు. నాకూ రాధకీ శాశ్వతంగా ఈ పీడ వదిలిపోతుంది."

"నన్ను రక్షించావు అల్లుడూ!"

"కాదు. ఇదంతా నేను నీకోసం చేయలేదు."

"మరి?"

"రాధ కోసం చేస్తున్నాను."

"ఏది ఏమైనా నీది మాస్టర్ మైండ్" - అంటూ రంగాకోసం కబురు చేశాడు నరసింహం.

ముగ్గురూ అరగంటసేపు చర్చించుకున్నారు.

*  *  *  *

అనుకున్న ప్లాను అనుకున్నట్లే జరిగింది.

రాధని తీసుకుని పోలీస్ స్టేషన్‌లో ప్రవేశించాడు నరసింహం. దాదాపు నలభై అయిదు నిమిషాల తరువాత రంగానుంచి ఫోన్ వచ్చింది.

అనుకున్నది అనుకున్నట్టే జరిగిందనీ - హరికృష్ణ శవాన్ని ఎవరికీ తెలియకుండా మాయం చేశామనీ - శారదమ్మ ఇంటికి పోలీసులు వచ్చేశారనీ, అక్కడ జనం అయిదు నిమిషాల క్రితమే ఆవిడ హత్య జరిగినట్టు సాక్ష్యం ఇచ్చారనీ చెప్పాడు.

నరసింహం రాధని తీసుకుని ఇంటికొచ్చేశాడు.

ఆ తరువాత సంఘటనలు ఫాస్ట్‌గా జరిగాయి.

*  *  *

శారదమ్మ హత్య పెద్ద సంచలనం సృష్టించలేదు.

ప్రభుత్వాధికారికి కూడా ఇందులో భాగం ఉంది కాబట్టి, డబ్బుతో అతడు పారిపోయాడు కాబట్టి, ఈ వార్త బయటికి పొక్కకుండా ప్రభుత్వం జాగ్రత్తపడింది.

పోలీసులు నాలుగైదుసార్లు నరసింహం ఇంటికొచ్చారు.

అతడినీ, మురళీనీ ఇంటరాగేట్ చేశారు.

నరసింహానికి ఎలిబీవుంది. ఆ టైమ్‌లో అతడు తన దగ్గిరే వున్నట్టు ఇనస్పెక్టర్ సాక్ష్యం ఇచ్చాడు.

ఆ తరువాత ఆ కేసు క్లోజయిపోయింది.

నరసింహం హాయిగా ఊపిరి పీల్చుకున్నాడు. మురళీ చేతులు కలిపాడు.